సాక్షి
వనపర్తి
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



వేసవి క్రీడా శిబిరాలు

జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో క్రీడా శిక్షణా శిబిరాలు కొనసాగుతాయి.

వివరాలు 10లో ▸



పడిపోయిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. 5 వేల బస్తాలు అమ్మకానికి వచ్చింది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /26.0

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వేడి గాలులు వీచే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపిస్తుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36
(గురువారం సాయంత్రం)

సహర్ 4-44
(శుక్రవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

వైభవం.. రథోత్సవం



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం దత్తాత్రేయ శ్రీరామ అవధూత లక్ష్మీనారసింహ యోగానందస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం కనులపండువగా జరిగింది. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా ముస్తాబుచేసిన రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తేరుగడ్డ వరకు లాగారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ రథం ముందుకు కదిలింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు. వారం పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు తీర్థావళి కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని గ్రామంలో ఊరేగించారు.

ప్రాథమిక వైద్యంపై అవగాహన అవసరం



వనపర్తిటౌన్: ప్రాథమిక వైద్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనే రాష్ట్ర ప్రభుత్వం సీపీఆర్‌పై శిక్షణ ఇస్తుందని జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు డా. నదియా, సాదత్ సీపీఆర్‌పై వసతి గృహ సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు చోటు చేసుకోవడంతో వయసుతో సంబంధం లేకుండా గుండె సమస్యలు తలెత్తి హఠాత్తుగా కుప్పకూలుతున్నారని, ఇలాంటి సమయంలో వారిని కాపాడేందుకు సీపీఆర్ ఉపయోగపడుతుందని వివరించారు. సీపీఆర్‌తో హార్ట్‌బీట్‌ను సాధారణ స్థాయికి తెచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు ఆంజనేయులు, అమృత్ సాగర్, మాధవి, జీవిత, కురుమూర్తి, రమేష్‌గౌడ్, వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



వనపర్తి: ఇటీవల నిర్వహించిన ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షలో వనపర్తి శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పాఠశాల నుంచి 98 మంది విద్యార్థులు పరీక్ష రాయగా. అందరూ రెండోలెవల్‌కు ఎంపికయ్యారని.. వారిలో కొందరు ప్రత్యేక బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ జవహర్‌బాబు వివరించారు. బుధవారం ఆయా విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీన్ గోపి, దేవేందర్, దీపిక పాల్గొన్నారు.

వరి క్వింటా రూ.2,106

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,106, కనిష్ఠంగా రూ.1,619గా ధరలు నమోదయ్యాయి. హంసధాన్యం ధర గరిష్ఠంగా రూ.1,711, కనిష్ఠంగా రూ.1,621, ఆముదాల ధర గరిష్ఠంగా రూ.5,859, కనిష్ఠంగా రూ.5,750గా ధరలు లభించాయి. మార్కెట్‌కు దాదాపు మూడు వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

రెండు, మూడు రోజులుగా వింత ప్రవర్తన, ఫిట్స్, ఆయాసం వంటి లక్షణాలతో ఆస్పత్రికి వస్తున్నారు. ఆశన్న, విష్ణుప్రకాశ్ మెటబాలిక్ ఎన్సెఫలోపతి లక్షణాలతో చనిపోయారు. మెడికో లీగల్ కేసుగా బుక్ చేసి పోస్టుమార్టంకు పంపించాం. ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్ అని అందరికీ చెప్పలేం. ఫోరెన్సిక్ ల్యాబ్ ఫలితాలు వస్తేనే కన్ఫర్మేషన్ వస్తుంది.
– రామకిషన్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

కల్లు తాగడం ఒక్కసారిగా బంద్ చేయడంతో అలా పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తారు. ఎండదెబ్బ ఒకటి, కల్లుతాగకపోవడం మరొకటి. ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నట్లు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు చెబుతున్నారు. తెలంగాణలో హరితహారం కింద చాలా ఈత చెట్లు నాటాం. జిల్లాలో కల్తీ కల్లు లేనే లేదు. ఈ జనరేషన్‌లో కల్లుతాగే వారి సంఖ్య తగ్గింది.
– సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

..ఇదండీ విషయం. వంకర మూతితో మెలికలు తిరుగుతూ.. మాట్లాడే పరిస్థితిలో లేకుండా వింతగా ప్రవర్తిస్తూ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు వచ్చిన వారి గురించి వైద్య, ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్న మాటలివి. మందు కల్లు తాగే అలవాటుందని బాధితులు ఓ పక్క చెబుతున్నప్పటికీ.. అధికార యంత్రాంగం పొంతన లేని సమాధానాలతో దాటవేస్తూ తప్పదోవ పట్టించేలా వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ముగ్గురు మృత్యువాత పడినా.. ఉమ్మడి జిల్లాలో పేట్రేగుతున్న కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ఎవరిదో గమ్మత్తు..!

కూలీ బతుకులు చిత్తు

- **మూడుకు చేరిన కల్తీ కల్లు మరణాలు**
- ఐసీయూలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి విషమం
- నిత్యం కల్లు తాగుతున్నామని ఒప్పుకుంటున్న బాధితులు
- పొంతన లేని సమాధానాలు చెబుతున్న ఎక్సైజ్, వైద్యాధికారులు
- మీడియాను ఆస్పత్రి లోపలికి అనుమతించకుండా పోలీసుల మోహరింపు

రోజంతా పనిచేసి అలిసిపోతాం. కల్లు తాగితేనే తెల్లారేది. నేను రోజూ తాగుతా. ఎప్పుడూ ఇట్ల కాలేదు. తిమ్మిరెక్కడం, మూతి వంకర పోవడం, తల తిరుగుతున్నట్లు ఉండడంతో ఆస్పత్రిలో చేరా. డాక్టర్లు తగ్గుతుందని చెప్పారు. ట్రీట్మెంట్ ఇస్తున్నారు.
– ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాధితురాలు



మొన్న ఒకలా.. నిన్న మరొకలా..

మెడ తిమ్మిర్లు రావడం, చేతులు వణకడం, తలవెనక్కి వాలడం, నాలుక బయటకు రావడం, నత్తి రావడం, శరీరంలో చలనం లేకపోవడం వంటి లక్షణాలతో కల్తీ కల్లు బాధితులు జిల్లా ఆస్పత్రికి వస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ రామకిషన్ మాట్లాడుతూ వింత ప్రవర్తనతో ఆస్పత్రికి ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు దాదాపు 25 మంది వచ్చారని చెప్పారు. అదే బుధవారం మాట్లాడుతూ ఇలాంటి లక్షణాలతో 15 మంది అడ్మిట్ అయ్యారని.. ఇందులో 11 మంది మహిళలు, నలుగురు పురుషులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అందరినీ డిశ్చార్జి చేశామని.. ఇద్దరు మహిళలు ఐసీయూలో, మరో ఇద్దరు సాధారణ వార్డులో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత మళ్లీ ఐసీయూలో ఉన్న ఇద్దరు మాత్రమే చికిత్స పొందుతున్నారని పొంతన లేని సమాధానాలు చెప్పడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పాలమూరు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

బేరసారాలు..?

కల్తీ కల్లు కారణంగా మృతి చెందినట్లు ప్రకటించకుండా కల్లు మాఫియా తరఫున ఓ నామినేటెడ్ పోస్టులో ఉన్న నాయకుడు ఆస్పత్రి వర్గాలపై ఒత్తిడి తేవడంతో పాటు బేరసారాలు జరిపినట్లు సమాచారం. పోలీస్ కేసు అయితే రైతు బీమా కింద రూ.5 లక్షలు రావని చెప్పి ఓ మృతుడి కుటుంబ సభ్యులను పిలిచి.. ఓ వ్యక్తి ద్వారా అప్పటికప్పుడు రూ.20 వేలు అందజేసినట్లు తెలిసింది. ఎండ దెబ్బ కొట్టడం, కడుపునొప్పితో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరగా.. మృతిచెందినట్లు మృతుడి బంధువుతో పోలీస్ కేసునమోదు చేయించినట్లు వినికిడి. అదేవిధంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కల్లు మాఫియాకు చెందిన వ్యక్తులు ఆదివారం కలిసినట్లు వినికిడి. ఒక్కొక్కరికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అందజేసి.. అస్వస్థతకు కల్లు కాదని చెప్పాలంటూ వారితో ప్రమాణం చేయించుకున్నట్లు సమాచారం. మరొకరి మృతిలో రూ.3 లక్షల వరకు చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలీస్ బలగంతో..

ఆశన్న మృతి ఆలస్యంగా వెలుగులోకి రావడం.. బుధవారం ఉదయం విష్ణుప్రకాశ్ చనిపోవడంతో మీడియా మొత్తం ఆస్పత్రికి తరలివచ్చింది. అయితే ఆస్పత్రి సిబ్బంది ఎవరినీ లోపలకు రాకుండా అడ్డుకున్నారు. అక్కడికి భారీగా పోలీసులు చేరుకోగా.. సూపరింటెండెంట్ చెబితేనే లోపలికి పంపిస్తామని చెప్పారు. ఈ క్రమంలో వైద్య వర్గాలు, మీడియా మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సూపరింటెండెంట్ బయటకు రాగా.. ఆస్పత్రిలో మాట్లాడడానికి కూడా వైద్యులు ముందుకురావడం లేదని, సిబ్బంది సైతం అలానే ఉన్నారని, సూపరింటెండెంట్ ఆదేశాలు ఇచ్చారని చెబుతున్నారని.. దీనిపై ఏమంటారు అని మీడియా ప్రశ్నల వర్షం కురిపించడంతో పాటు ఆయన తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఆయన సమాధానాలు చెప్పడంతో అందరూ శాంతించారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

కొత్తకోట: పుర పరిధిలోని వేముల హరీశ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేష్ ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తున్నారని.. ఆరుతడి పంటలతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని సూచించారు. డ్రిప్‌తో మొక్కలకు ఎరువులు ఎలా అందించాలో వివరించారు. కార్యక్రమంలో రైతులు రామచంద్రారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి

తొలగించిన ఓటర్ల వివరాలు పరిశీలిస్తాం

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. చిత్రంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్

వనపర్తి: ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను మరోమారు పరిశీలించి ధ్రువీకరిస్తామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. బుధవారం ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీకృత కలెక్టరేట్ నుంచి ఆయన పాల్గొని వివరాలు వెల్లడించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీ మొదటి దఫా కింద క్షేత్రస్థాయిలో తొలగించిన ఓటర్ల వివరాలు మరోసారి పరిశీలించేలా సిబ్బందికి సూచనలు చేస్తామని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన వారి పేర్లు, డూప్లికేట్ ఓటర్ల జాబితా నుంచి తొలగించామన్నారు. తొలగించిన ఓటర్లకు సంబంధించి పూర్తి సమాచారం తమవద్ద ఉందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. వచ్చేవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ నెల 15న ఓరియంటేషన్ కార్యక్రమం చేపట్టాలని రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లకు సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ రాజేందర్‌గౌడ్, సి-సెక్షన్ అధికారి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలు సరికాదు

- **బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్**

వనపర్తి: అవకాశవాద రాజకీయాలు చేసే మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంత్రి నిరంజన్ రెడ్డిని విమర్శించే హక్కులేదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. బుధవారం పట్టణ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పెబ్బేరు ఎంపీపీ కమలేశ్వర్‌రావు, పానగల్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, రమేష్‌గౌడ్, చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో మంత్రి హోదాలో ఉండి తెలంగాణ వాదాన్ని అణగదొక్కేందుకు నాయకులపై కేసులు నమోదు చేయించారని.. తర్వాత రాజకీయ భవిష్యత్ కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని విమర్శించారు. కొల్లాపూర్‌లో కాదు.. ధైర్యం ఉంటే వనపర్తికి వచ్చి ఎవరి చిత్తశుద్ధి ఎంతో తేల్చాలని సవాల్ విసిరారు. పెబ్బేరు ఎంపీపీ కమలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పార్టీ నిబంధనలను అతిక్రమిస్తే స్థాయి ఎంతపెద్దదైనా చర్యలు తప్పవని అధిష్ఠానం ఈ చర్యతో స్పష్టం చేసిందన్నారు. పొత్తులో భాగంగా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బరిలో నిరంజన్‌రెడ్డి పోటీచేస్తే.. పార్టీ ఇచ్చిన ఆదేశాలను తుంగలోతొక్కి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఘనత జూపల్లికి ఉందని తెలిపారు. పార్టీ నిర్ణయాలపై ఆయనకు మొదటి నుంచి గౌరవం లేదన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్.. పాల్గొన్న ఎంపీపీలు, నాయకులు

'రాహుల్‌పై కక్ష సాధింపు తగదు'



మాట్లాడుతున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదాని, అంబాని ఆస్తులను కాపాడటమే పనిగా పెట్టుకొని రాహుల్‌గాంధీపై కుట్రలు చేస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న డా. బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మంచిర్యాల డీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగసభను జయప్రదం చేసేందుకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హిండెన్‌బర్గ్ నివేదికల ఆధారంగా జాయింట్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో రాహుల్‌గాంధీపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని.. తగదన్నారు. రోజురోజుకు రాహుల్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అక్రమ కేసులు, పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం వంటి చర్యలకు పాల్పడటం శోచనీయమని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, రాహుల్‌గాంధీకి మద్దతుగా ఉండాలన్న లక్ష్యంతో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న భారీ బహిరంగసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, శ్యామ్, ప్రకాశం, తౌఫీక్, లక్ష్మీకాంత్‌రెడ్డి, తులసీరాజ్, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు విక్రయాలపై చర్యలెందుకు లేవు?

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సొంత జిల్లాలోని తన నియోజకవర్గంలో సంబంధిత శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కనుసన్నల్లోనే కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని, కల్తీ కల్లు లేదనేది పచ్చి అబద్ధమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని ఆమె మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధితులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడుంబాను బంద్ చేయించి కల్తీ కల్లును ప్రోత్సహిస్తున్నారా అని ప్రశ్నించారు. కల్తీ కల్లును బయటికి రానివ్వకుండా వడదెబ్బ అంటూ అసత్యాలు చెప్పడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కల్తీ వ్యాపారాలపై చర్యలు తీసుకుంటామని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం పాలమూరులో జరుగుతున్న కల్తీ కల్లు విక్రయాలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ అక్రమ వ్యాపారం వెనుక మంత్రి పాత్ర ఉన్నందుకే యథేచ్ఛగా జరుగుతుందని ఆరోపించారు. వార్తలు రాసిన మీడియా ప్రతినిధులను బెదిరిస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

అయోమయం!

ఉద్యోగం వైద్య కళాశాలలో.. విధులు డీఎంహెచ్‌ఓగా...

- 2023, మార్చి 2న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ
- ఎల్‌పీసీ తీసుకున్నా.. డీఎంహెచ్‌ఓగానే విధులు



డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్‌ను సీఎస్ఆర్ఎంఓగా నియమిస్తూ జారీచేసిన ఉత్తర్వులు



వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల భవనం

వనపర్తి: ఓ ఉద్యోగి కేటాయించిన చోటనే విధులు నిర్వర్తించడం చూసి ఉంటాం. కానీ వనపర్తి జిల్లాలో బాధ్యతలు ఓ చోట.. విధులు మరోచోట నిర్వహించటం కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వైద్య, ఆరోగ్యశాఖలో పబ్లిక్‌హెల్త్, వైద్య విధాన పరిషత్.. వైద్య విద్య, టీఎస్ఎంఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సొసైటీ) విభాగాలు ఉంటాయి. ఈ మూడు విభాగాలు దేనికదే ప్రత్యేకం. ఎక్కడి ఉద్యోగులు అక్కడే పనిచేసి ఆ విభాగం నుంచే వేతనాలు తీసుకోవాలనేది ప్రభుత్వ నిబంధన. కాని ఉన్నతాధికారులు అవసరాలకు అనుగుణంగా ఆయా విభాగాల్లోని ఉద్యోగుల సేవలు వినియోగించుకుంటున్నారు. వైద్య విధాన పరిషత్‌లో విధులు నిర్వర్తించాల్సిన డా. రవిశంకర్ డీఎంహెచ్‌ఓగా పబ్లిక్ హెల్త్ విభాగంలో పని చేస్తున్నారు. ఇతడిలా ఇతర విభాగాల్లో పని చేస్తున్నవారు రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు ఉన్నట్లు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ 2023, మార్చి 2న సొంతశాఖ అయిన వైద్య విధాన పరిషత్, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. వారి ఆదేశం మేరకు డా. రవిశంకర్ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా బాధ్యతలు చేపట్టి రిపోర్టు అందజేశారు. కొద్ది రోజుల వ్యవధిలోనే ఎల్‌పీసీ(లాస్ట్ పే సర్టిఫికెట్) సైతం వైద్య విధాన పరిషత్ విభాగంలో అందజేశారు. కాని నేటికీ కనీసం ఒక్కరోజు కూడా వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించలేదు. బయోమెట్రిక్ హాజరు లేకపోవడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆయన వేతన బిల్ చేయలేదు. సీఎస్ఆర్ఎంఓగా విధుల్లో చేరినా.. నేటికీ డీఎంహెచ్‌ఓగానే విధులు నిర్వర్తించడం గమనార్హం.

తప్పు ఎవరిదీ?

పబ్లిక్ హెల్త్ విభాగంలో డీఎంహెచ్‌ఓ పోస్టు కీలకమైంది. ఆ ఉద్యోగిని మరోచోటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చే క్రమంలో ఆ పోస్టుకు మరో అధికారిని నియమించడంగాని.. సీనియర్, అర్హతగల ఇంకొకరికి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వాలి ఉంది. కానీ డా. రవిశంకర్‌ను వైద్య కళాశాల సీఎస్ఆర్ఎంఓగా నియమిస్తున్నట్లు పేర్కొంటూ.. డీఎంహెచ్‌ఓ పోస్టు గురించి ప్రస్తావించకపోవటం గమనార్హం. అలాగే డీఎంహెచ్‌ఓ ఖాళీపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పష్టత సైతం డా. రవిశంకర్ తీసుకోలేదు. వైద్య కళాశాలలో సీఎస్ఆర్ఎంఓగా చేరినా డీఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తుండటంతో ఉద్యోగులు ఏ ఫైల్‌పై కౌంటర్ సంతకం చేయాలన్నా తోటి ఉద్యోగులతో ఒకటికి రెండుసార్లు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. సాధ్యమైనంత వరకు ఏఓ చేతుల మీదుగానే కార్యకలాపాలు కొనసాగించేందుకు ఉద్యోగులు సుముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది.

వేతనం ఎలా చేస్తాం..



సీఎస్ ఆర్ఎంఓగా డా. రవిశంకర్ మార్చి మొదటి వారంలో కళాశాలలో రిపోర్టు చేశారు. బయోమెట్రిక్ హాజరు ఆధారంగా ఉద్యోగుల వేతనాలు చేస్తాం. ఆయన హాజరు లేకపోవడంతో వేతనం బిల్ చేయలేదు. విధులకు హాజరుకావాలని పలుమార్లు ఫోన్‌లో కోరాం. డీఎంహెచ్‌ఓగా ఎవరూ రాలేదని చెప్పటంతో చేసేది లేక నిమ్మకుండిపోయాం.
– సునందిని, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, వనపర్తి

ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసమే..



వైద్య విధాన పరిషత్ విభాగంలో సీఎస్ఆర్ఎంఓగా బాధ్యతలు తీసుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ నుంచి ఆదేశాలు అందాయి. వారి ఆదేశం మేరకు అక్కడ రిపోర్టు చేశా. అదే సమయంలో డీఎంహెచ్‌ఓగా మరొకరిని నియమిస్తున్నట్లు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అకస్మాత్తుగా వదిలేసి వెళ్తే.. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఇబ్బంది కలుగుతుందని డీఎంహెచ్‌ఓగానే విధులు నిర్వర్తిస్తున్నా. ఇందులో నా స్వార్థం ఏమీ లేదు.
– డా. రవిశంకర్, సీఎస్ఆర్ఎంఓ, ప్రభుత్వ వైద్య కళాశాల, వనపర్తి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కల్వకుర్తి టౌన్: బొలెరో వాహనం బైకును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. కల్వకుర్తిలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ రమేష్, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పంజుగుల గ్రామానికి చెందిన బాలయ్య (50) వ్యవసాయదారుడు. వరికోత మిషన్లు నడిపిస్తూ జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం అచ్చంపేట మండలం ఘన్‌పూర్‌కు చెందిన ఆంజనేయులు, తిరుపతయ్యతో కలిసి గ్రామం నుంచి బైకుపై కల్వకుర్తి వెళ్లారు. దేవరకొండ రోడ్డులో ఉన్న ట్రాక్టర్ మెకానిక్ దుకాణంలో ట్రాక్టరుకు సంబంధించిన సామాన్లు కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా బొలెరో వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై ఉన్న మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య


రజియా బేగం(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. రైల్వే ఎస్ఐ అక్బర్ కథనం ప్రకారం ..మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని శివశక్తినగర్‌కు చెందిన రజియా బేగం(46) బుధవారం పట్టణంలోని బండమీదిపల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. కొన్ని రోజులుగా ఆమె మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడం వల్ల మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం విభాగానికి తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ బలవన్మరణం

గద్వాల క్రైం: ఉరేసుకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం గద్వాలలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన మోనాబేగం (26) కొన్నిరోజులుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. వ్యాధి తీవ్రత పెరగడంతో మనస్థాపానికి గురై సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని మృతిచెందింది. తండ్రి సర్దార్‌ఖాన్ గుర్తించి స్థానికుల సాయంతో కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అయితే ఇటీవలే చింతరేవులకు చెందిన మహ్మద్‌ను ఆమె రెండో వివాహం చేసుకుందని.. కుటుంబ కలహాలు సైతం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: సీపీఎస్ నిధులు కాజేసిన ఉద్యోగిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం కేసు నమోదైంది. ఎస్ఐ అబ్దుల్ షుకూర్ కథనం మేరకు.. గద్వాల ఇరిగేషన్‌శాఖ కార్యాలయంలో టైపిస్టుగా విధులు నిర్వహిస్తున్న జహంగీర్ అదేశాఖలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందికి చెందిన సీపీఎస్ నిధులు రూ.18 లక్షలు తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించారు. విషయం తెలుసుకున్న అకౌంటెంట్ శ్రీనివాస్‌కుమార్, సిబ్బంది ఫిర్యాదు చేయగా సదరు వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మహిళలపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: మద్యంమత్తులో ఓ మహిళపై దాడి చేసి, బూతులు తిట్టిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్సై శ్రీహరి కథనం ప్రకారం.. మండలంలోని సల్కెలాపురంలో మంగళవారం రాత్రి ఆటో డబ్బుల విషయంలో గ్రామానికి చెందిన తిరుపతయ్య, కురుమూర్తి గొడవపడ్డారు. ఈ సమయంలో మద్యంమత్తులో అక్కడే ఉన్న చంద్రయ్య మధ్యలో కలుగజేసుకుని కురుమూర్తిని తోశాడు. దీంతో ఆ పక్కన ఉన్న అలివేలు చంద్రయ్యను వారించేందుకు యత్నించగా బూతులు తిడుతూ, చేతిలోని తాళం చెవితో కంతపై కొట్టాడు. దీంతో ఆమెకు రక్తగాయాలయ్యాయి. దీన్నిచూసి మరో మహిళ మేడమోని లావణ్య వారించేందుకు వెళ్లింది. ఆమె చీరలాగి అవమానించడంతో పాటు దుర్భాషలాడాడు. ఈ విషయమై లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం చంద్రయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడ్డ ఇద్దరికి రిమాండ్

బాలానగర్: ఓ బాలిక ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు వ్యక్తులను బుధవారం రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ జయప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సింధుజ రైలుకింద పడి ఈనెల 5న ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెపై బాలానగర్‌కు చెందిన అభిరాం, షాద్‌నగర్‌కు చెందిన శివ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడ్డారు. దీనివల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని తేలడంతో రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

జనరల్ ఆస్పత్రిలో హైడ్రామా

- మీడియా ప్రతినిధులను అడ్డుకున్న ఆస్పత్రి సెక్యూరిటీ
- మధ్యాహ్నం వరకు కొనసాగిన నాటకీయ పరిణామాలు
- కల్తీ కల్లు బాధితులను పరామర్శించిన బీజేపీ నేతలు


సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్‌తో మాట్లాడుతున్న నాయకులు

పాలమూరు: కల్తీ కల్లు వ్యవహారంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హైడ్రామా కొనసాగింది. ఆరు రోజులుగా ప్రభుత్వ ఆస్పత్రికి కల్లు తాగిన విషయంలో బాధితులు చికిత్స కోసం వచ్చారు. ఇద్దరు మృతి చెందాడు. మరో ఇద్దరు ఐసీయూలో ఉండటం కలకలం రేపింది. బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో కల్తీ కల్లు తాగిన దాంట్లో ఐసీయూలో చికిత్స పొందుతూ విష్ణు ప్రకాష్ అనే యువకుడు మృతి చెందాడు. ఈ విషయం బయటకు రావడంతో ఆస్పత్రి వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఐసీయూ వైపు ఇతరులను పంపించకపోవడం, మీడియా ప్రతినిధులను లోపలికి పంపకుండా అడ్డుకున్నారు. సూపరింటెండెంట్ అనుమతి లేనిదే ఎవరినీ పంపించబోమని స్థానిక సెక్యూరిటీ అడ్డుకుంటున్నారు. దీంతో మీడియా ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ తర్వాత కొంత సమయానికి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ ముఖద్వారం దగ్గరకు చేరుకుని కల్తీ కల్లు వ్యవహారంలో ఎంతమంది బాధితులు అడ్మిట్ అయిన దాంతో పాటు, మరణాలపై వివరాలు వెల్లడించారు.

➡ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మహిళా వార్డులో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం ఉదయం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో ఇతర నేతలు పరామర్శించి వారితో మాట్లాడారు. అదేవిధంగా రేణుక అనే బాధితురాలి తమ్ముడితో మాట్లాడి ఏం జరిగింది. ఎలాంటి చికిత్స అందిస్తున్నారు అనే విషయాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ ఛాంబర్‌లో ఆయనతో మాట్లాడారు. ఈ క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి సూపరింటెండెంట్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో ఫోన్‌లో మాట్లాడించాలని ప్రయత్నం చేయగా, అప్పటికే బండి సంజయ్ ఢిల్లీ వెళ్లే విమానం ఎక్కినట్లు తెలియడంతో మాట్లాడించలేదు. పేద జిల్లా అయిన పాలమూరులో కూలీలు కల్తీకల్లుతో సతమతం అవుతున్నారని నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు.


బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

కల్తీకల్లు బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని పాలమూరు అభివృద్ధి ఫోరం నాయకులు మున్నూర్ రవి డిమాండ్ చేశారు. కల్తీ కల్లు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న కల్తీ కల్లును అడ్డుకోవాల్సిన ఇక్కడి ప్రజాప్రతినిధి చోద్యం చూస్తుండటం సిగ్గు చేటన్నారు. పాలమూరు పట్టణంలో 18 ప్రాంతాల్లో అనుమతిలేని కల్లు విక్రయ కేంద్రాలు కొనసాగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చే శారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మైత్రియాదయ్య, పటేల్ వెంకటేశ్, రాకేశ్, రోహిత్‌రెడ్డి, ఆంజనేయప్రసాద్ యాదవ్, పవన్‌రాథోడ్, సక్రునాయక్, జోసెఫ్, వివేక్ పాల్గొన్నారు.

కల్తీ కల్లును కంట్రోల్ చేయలేరా?

సొంత జిల్లాలో కల్తీ కల్లును కంట్రోల్ చేయలేని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో కల్తీ కల్లు తాగి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంకిషన్‌తో సమావేశమైన అనంతరం ఆస్పత్రి బయట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ కల్లులేదని చెప్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సొంత నియోజకవర్గంలో కల్తీ కల్లు సేవించి ఆస్పత్రుల పాలై ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జిల్లా కేంద్రం కల్తీ కల్లుకు అడ్డాగా మారిందన్నారు. కల్లు వ్యాపారుల నుంచి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు భారీగా ముడుపులు ముట్టినందునే ఈ సంఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ కల్లు కారణంగా చనిపోయిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, సుబ్రహ్మణ్యం, నారాయణయాదవ్ తదితరులు ఉన్నారు.

రాతి విగ్రహం చోరీ


నాగులమ్మ విగ్రహం ఉన్న స్థలం

అచ్చంపేట రూరల్: శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో రాతి నాగులమ్మ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాపనాశిని గుండం వద్దకు వెళ్లే దారిలో నాగులకట్ట ఉంది. పురాతన రాతి నాగులమ్మ విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పెకిలించి తీసుకెళ్లారు. బుధవారం ఉదయం భక్తులు గమనించి ఆలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దొంగలను గుర్తించి విగ్రహాన్ని స్వాధీనం చేయాలని ఈఓ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో 70 గొర్రె పిల్లల మృతి

చిన్నంబావి: మండలంలోని గూడెంలో బుధవారం అగ్నిప్రమాదంలో 70 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గొర్రె పిల్లలను పొలంలో పెట్టి గొర్రెల కాపరి కురువ కేశవులు గొర్రెలను మేతకు తీసుకుని అడవికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో చెత్తను అంటించడంతో మంటలు పెద్దగా చెలరేగి గొర్రె పిల్లలు ఉన్న ప్రాంతానికి వ్యాపించాయి. దాంతో అక్కడే ఉన్న గొర్రె పిల్లలు అక్కడికక్కడే సజీవదహనం అయ్యాయి. ఒక్కసారిగా గొర్రె పిల్లలు చనిపోవడంతో అప్పుల భారం పెరిగిపోతుందని గొర్రెల కాపరి బోరుమన్నాడు.

ఆటో డ్రైవర్ కోసం గాలింపు

జడ్చర్ల: మండలంలోని పెద్దపల్లికి వెళ్లేందుకు మంగళవారం రాత్రి ఆటో ఎక్కిన వృద్ధురాలు రామకృష్ణమ్మపై కత్తితో దాడిచేసి మెడలో ఉన్న పుస్తెలతాడును అపహరించిన ఘటనలో ఆటో డ్రైవర్, మరో మహిళ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. బాధితురాలిని మహబూబ్‌నగర్‌ని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఆటో ఎక్కిన ప్రదేశం , అక్కడున్న సీసీ కెమెరాలను ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఆటో డ్రైవర్లను పిలిపించి విచారించారు. త్వరలోనే నిందితులను గుర్తిస్తామని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

మాగనూర్: కారు, బైక్ ఢీకొని ఇద్దరు తీవ్రం గాయపడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వర్కూర్‌కి చెందిన ఇద్దరు వ్యక్తులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ క్లీనిక్‌కు చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై వచ్చారు. మందుల కోసం మెడికల్ షాపుకు వచ్చి తిరిగి క్లీనిక్‌కు వెళ్తున్న సమయంలో రోడ్డు క్రాస్ చేస్తుండగా మక్తల్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వారి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని దగ్గరలోని ప్రైవేట్ క్లీనిక్ తరలించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో డివైడర్‌ల దగ్గర స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గత 20 రోజుల వ్యవధిలో ఇక్కడ పదుల సంఖ్యలో ప్రమాదాలు సంభవించాయని, అందులో ఒకరు ప్రాణాలు సైతం కోల్పోయారని స్థానికులు అంటున్నారు.

నలుగురిపై పీడీ యాక్ట్ నమోదు


మాట్లాడుతున్న ఎస్పీ కె.నరసింహ

- మహబూబ్‌నగర్‌లో ఫిబ్రవరి 7న జరిగిన హత్యాయత్నం కేసులో..
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కె.నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్‌లోని బాయమ్మతోట సమీపంలో ఫిబ్రవరి 7న తండ్రి కొడుకులపై జరిగిన హత్యాయత్నం కేసులో షేక్ హసీం, అబ్దుల్ అహ్మద్, అబ్దుల్ నవాజ్, ఎండీ రహమాత్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పూర్తి వివరాలను ఎస్పీ వెల్లడించారు. పీడీ యాక్ట్ నమోదుతో ఈ నలుగురికి ఏడాది వరకు బెయిల్ మంజూరు కాదని తెలిపారు. జనం భయపడే విధంగా మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారని.. ఈ కేసును టూటౌన్ సీఐ వేగంగా దర్యాప్తు చేసి నేరస్తులను పట్టుకున్నట్లు వివరించారు. ఈ కేసులోని మరో ఇద్దరు నేరస్తులతో పాటు జిల్లావ్యాప్తంగా వివిధ కేసుల్లో ఉన్న మరో 14 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. 2018 నుంచి 2022 వరకు జిల్లావ్యాప్తంగా 20 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి వారికి శిక్షలు త్వరగా పడేలా చర్యలు చేపడుతామన్నారు. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, అమ్మాయిలపై దాడులు, రవాణా, నకిలీ డాక్యుమెంట్లతో మోసం చేసేవారు, నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయించే వారు, డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కూడా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీలు మహేష్, రమణారెడ్డి, మధు, టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

- 17 తులాల వెండి బ్రాస్‌లెట్, మొబైల్, బైక్ స్వాధీనం

వనపర్తి క్రైం: వనపర్తి జిల్లా కేంద్రంలో చోరీలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వనపర్తి పట్టణ పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్పీ కె.రక్షితమూర్తి తన కార్యాలయంలోనా వివరాలు వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంటకు చెందిన గణేష్ కూలీ పనులు చేస్తూ వనపర్తిలోని గణేష్‌నగర్‌లో ఉంటున్నాడు. వనపర్తి మండలం కడుకుంట్లకు చెందిన మహేష్ కూడా కూలీ పని చేస్తుండేవాడు. వీరు పట్టణంలోని చల్మారెడ్డి ఆస్పత్రి వద్ద గల కూలీల అడ్డాలో తరచూ కలుస్తుండేవారు. ఈ క్రమంలోనే తాగుడుకు బానిసయ్యారు. డబ్బుల కోసం అప్పుడప్పుడు పట్టణంలో చోరీలకు పాల్పడేవారు. ఈనెల 7న శ్రీనివాసపురానికి చెందిన తిరుమలయ్య జంగిడిపురంకాలనీ జాగృతి కళాశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి కూలీ పనికి వెళ్లాడు. అటుగా వెళ్లిన గణేష్, మహేష్ ఆ బైక్‌ను చోరీ చేసి బుద్దారంలో ఉన్న తన బంధువుల ఇంట్లో దాచిపెట్టారు. అలాగే పెద్దమందడి మండలం జంగమాయపల్లికి చెందిన వృద్ధుడు బాలయ్య హైదరాబాద్ వెళ్లేందుకు ఈనెల 10న వనపర్తికి వచ్చాడు. గాంధీచౌక్ నుంచి సంతబజార్ వైపు వెళ్తున్న అతన్ని బైక్‌పై వచ్చిన గణేష్, మహేష్ ఆపారు. కూలీ పనికి వస్తావా? పని ఇప్పిస్తాము అని నమ్మబలికి నాగవరం సమీపంలో నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. భయభ్రాంతులకు గురి చేసి అతని వద్ద ఉన్న రూ.5వేల నగదు, 17 తులాల బ్రాస్‌లెట్ కడెం , ఫోన్ తీసుకొని వెళ్లిపోయారు. దీంతో భయాందోళనకు గురైన వృద్ధుడు అక్కడి నుంచి తన పెద్దకూతురు ఊరైన రాజపేటకు వెళ్లాడు. జరిగిన విషయం చెప్పి మరుసటి రోజు కూతురుతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల్లో గమనించారు. చల్మారెడ్డి ఆస్పత్రి వద్ద కూలీల అడ్డాలో నిఘా ఉంచారు. బుధవారం అక్కడికి వచ్చిన గణేష్, మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5వేల నగదు, 17తులాల వెండి బ్రాస్‌లెట్, మొబైల్, మరో కేసులో ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ ఎస్ఐలు యుగంధర్‌రెడ్డి, రాము, పోలీస్ సిబ్బంది అశోక్, మహేశ్వర్, నాగరాజు, నిరంజన్‌ను అభినందించారు. అనంతరం వారికి నగదు పురస్కారం అందజేశారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రక్షితమూర్తి

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న కమలానందభారతి స్వామి

మక్తల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భువనేశ్వరం పీఠాధిపతి కమలానంద భారతి స్వామిజీ అన్నారు. బుధవారం పట్టణంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ప్రతి గ్రామంలో దేవాలయం ఉండాలని.. దేవుళ్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించినప్పుడే ఆ గ్రామం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. దేవాలయం లేని గ్రామంలో ఉండొద్దని.. ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకుంటే సన్మార్గంలో పయనిస్తారని తెలిపారు. ఆలయాలను సందర్శించడం పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో నారాయణపేట శక్తిపీఠం నిర్వాహకుడు శాంతనంద పురోహిత్, మాజీ చైర్మన్ రాజేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్, సీఐ సీతయ్య, భీంరెడ్డి, ఎస్ఐ పర్వతాలు, మహిపాల్‌రెడ్డి, కావలి తాయప్ప, శేఖర్‌రెడ్డి, శివారెడ్డి, నాగప్ప, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన యువతి

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం చెందిన యువకుడు అదేగ్రామానికి చెందిన యువతిని మోసం చేశాడని బుధవారం యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన స్వప్న అదే గ్రామానికి చెందిన సతీష్‌తో పరిచయం ఏర్పడి కొంతకాలంగా సహజీవనం చేసినట్లు యువతి తెలిపింది. ప్రస్తుతం తాను గర్భవతిని అని యువకుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని, అతనితో పెళ్లి చేసి న్యాయం చేయాలని యువతి కోరినట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు. ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి

- ఎంఈడీ ఫీజులు ప్రభుత్వమే భరించాలి
- పీయూలో విద్యార్థులతో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీఎస్‌పీఎస్సీలో లీకులకు పాల్పడుతూ, లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మార్చినందుకు వెంటనే బాధ్యత వహిస్తూ బోర్డును రద్దు చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. పాలమూరు లాంటి జిల్లాలో ఎంతో మంది పేద నిరుద్యోగ యువత ఉద్యోగం వస్తే బాగుంటుందని, ఆర్థిక ఇబ్బందులకు ఓర్చుకుని ఉద్యోగాలకు సిద్ధమవుతున్న క్రమంలో ఇలాంటి పరిణామం చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత బోర్డుతో పరీక్షలు నిర్వహించడం వల్లే నిరుద్యోగులకు భరోసా ఉండే పరిస్థితి లేదన్నారు. నష్టపోయిన వారికి ప్రభుత్వం సహకరించాలన్నారు. కేసును సీబీఐకి అప్పగించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, అప్పుడే అసలు సూత్రధారులు బయటికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పలువురు విద్యార్థులు పీయూలో ఎంఈడీ కోర్సు ఫీజులు చాలా అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేయవద్దని, ఆ ఫీజులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. యూనివర్సిటీలో జిమ్‌తో పాటు సౌకర్యాలపై ఆరా తీశారు. జిమ్ సరిగా పనిచేయడం లేదని విద్యార్థులు జవాబిచ్చారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి కోసం యూనివర్సిటీ న్యూస్ పేపర్లు, మ్యాగ్జిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీవిద్యగౌడ్, మీసాలగణేష్, మారుతి, ఆంజనేయులు, రూప్‌సింగ్, రాము పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

నిండు కుండలా రామన్‌పాడు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపి వేశారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

'చెక్కు'తో చిక్కారు!

ఏటా మార్చి 31న రూ.వందల కోట్ల చెక్కులు చూపిస్తున్న మార్గదర్శి

- బ్యాలన్స్ షీట్‌లో కనిపించిన చెక్కులు 90 రోజులు దాటినా నగదుగా మారని వైనం
- దారి మళ్లించిన రామోజీ.. రికార్డులు పరిశీలించేందుకు సమ్మతించని శైలజా కిరణ్
- తాజాగా ప్రధాన కార్యాలయంలో సీఐడీ విస్తృత సోదాలు.. అసలు చెక్కులు వచ్చిందీ లేదు.. నగదుగా మార్చిందీ లేదు
- మరో రూ.500 కోట్లు ఏటా నగదు రూపంలో వసూలు.. బ్రాంచీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా నల్లధనంగా తరలింపు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతమైంది. మనీ లాండరింగ్‌కు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) దృష్టికి సీఐడీ తీసుకొచ్చింది. చట్టాలను ఉల్లంఘించి రామోజీరావు, ఆయన కుటుంబం పాల్పడుతున్న ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా వివరించింది. మరోవైపు సీఐడీ అధికారులు హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో బుధవారం విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాల్లో అక్రమ పెట్టుబడులు, చందాదారులు సొమ్ము నిబంధనలకు విరుద్ధంగా బదిలీకి సంబంధించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్, సంస్థ డైరెక్టర్ల పాత్రకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంస్థ బ్యాలన్స్ షీట్లు, నగదు–చెక్కు వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు, నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో వెలుగు చూసిన ఆర్థిక అక్రమాలకు మూలం అంతా హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయమేనని వెల్లడైంది.



బెడిసికొట్టిన ఏ-1 రామోజీ, ఏ-2 శైలజ పన్నాగం

ఏ-1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్ ఈ కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు చేసిన ప్రయత్నాలను సీఐడీ తాజా సోదాలతో అడ్డుకుంది. ఈ నెల 3న రామోజీరావును, శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించిన విషయం విదితమే. మార్గదర్శి చిట్‌ఫండ్స్ నుంచి నిధుల మళ్లించామని అంగీకరిస్తూనే ఆ వ్యవహారాలతో తనకు సంబంధం లేదని, అంతా బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) చూసుకుంటారని ఈ సందర్భంగా రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. మరోవైపు శైలజా కిరణ్ కూడా అదే రీతిలో విచారణకు సహకరించకుండా సహాయ నిరాకరణ చేశారు.

అక్రమంగా బదిలీ చేసింది వారిద్దరే

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చందాదారుల సొమ్మును అక్రమంగా మళ్లించింది సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజా కిరణేనని సీఐడీ సోదాల్లో వెల్లడైంది. ఆ నిధులను రామోజీరావు కుటుంబానికి చెందిన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)– బెంగళూరు, మార్గదర్శి(తమిళనాడు)–చెన్నై సంస్థల్లోకి మళ్లించారు. కంపెనీ చైర్మన్ హోదాలో రామోజీరావు, ఎండీ హోదాలో శైలజతోపాటు డైరెక్టర్ల ఆమోదంతోనే ఆ నిధులు మళ్లించారనేందుకు కీలక ఆధారాలు సీఐడీకి లభ్యమయ్యాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు కేసు దర్యాప్తులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారని విశ్వసనీయ సమాచారం.

ఆ చెక్కులు ఎక్కడ..?

ఏటా సరిగ్గా.. మార్చి 31న రూ.వందల కోట్ల విలువైన చెక్కులు వస్తున్నట్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ తన బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తోంది. 2022 మార్చి 31న కూడా రూ.550 కోట్ల విలువైన చెక్కులు వచ్చినట్లు చూపించారు. కానీ నిర్ణీత 90 రోజుల్లోగా ఆ చెక్కులను నగదుగా మార్చడం లేదని సీఐడీ అధికారుల సోదాల్లో వెలుగులోకి వచ్చింది. చెక్కుల్లో చూపిస్తున్న నిధులను రామోజీ తన కుటుంబ ప్రయోజనాల కోసం అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపైనే సీఐడీ అధికారులు ప్రశ్నించడంతో శైలజా కిరణ్ షాక్‌కు గురయ్యారు. ఆ చెక్కులు నగదుగా మారాయో లేదో రికార్డులు తమ వద్ద లేవని చెప్పడంతో ప్రధాన కార్యాలయానికి వెళ్లి పరిశీలిద్దామని సీఐడీ అధికారులు సూచించారు. అందుకు ఆమె అంగీకరించకపోగా సీఐడీ అధికారులు అక్కడకు వెళ్లేందుకు కూడా సమ్మతించలేదు. ప్రధాన కార్యాలయంలోని కీలక రికార్డులను సీఐడీ పరిశీలించేందుకు శైలజా కిరణ్ ఒప్పుకోకపోవడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు బుధవారం నిర్వహించిన సోదాల్లో ఏటా బ్యాలన్స్ షీట్‌లో చూపిస్తున్న చెక్కులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అసలు చెక్కులు రావడంగానీ, వాటిని నగదుగా మార్చడంగానీ జరగడం లేదని గుర్తించారు.

నగదు రూపంలో ఏటా రూ.500 కోట్లు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏటా రూ.500 కోట్లను నగదు రూపంలో వసూలు చేస్తున్నట్లు బ్రాంచి కార్యాలయాల్లో గతంలో నిర్వహించిన సోదాల్లో వెలుగు చూసింది. కానీ ఆ నిధులను బ్రాంచి కార్యాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంలేదు. ఆ నగదు నిల్వలేవీ ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో కూడా లేనట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. అంటే ఆ డబ్బులను నల్లధనం రూపంలో అక్రమంగా తరలిస్తున్నట్లు రూఢీ అయింది. అందుకు సంబంధించిన కీలక ఆధారాలు కూడా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రామోజీ బెంబేలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలను సీఐడీ ఆధారాలతో సహా జాతీయ దర్యాప్తు సంస్థల దృష్టికి తేవడంతో ఈ కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. సీఐడీ దర్యాప్తుపై మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన ఆయన తొలిసారిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరిట తాజాగా పత్రికా ప్రకటన జారీ చేశారు. ఈడీ, సీబీడీటీ దర్యాప్తు తప్పదేమోనన్న ఆందోళన అందులో వ్యక్తమైంది. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యకలాపాలు నిలిచిపోయాయని ఆ ప్రకటనలో అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏపీలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు ఏవీ ప్రారంభించడం లేదని పేర్కొనడం గమనార్హం.

'మార్గదర్శి' మోసాలివిగో

జాతీయ దర్యాప్తు సంస్థలకు సీఐడీ సూచన

సాక్షి, న్యూఢిల్లీ: చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మోసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు క్షుణ్నంగా విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం సూచించింది. మనీ లాండరింగ్, నిధుల స్వాహా, కార్పొరేట్ మోసాలు, బినామీ లావాదేవీలతో పన్ను ఎగవేత లాంటి కీలక అంశాలను తమ విచారణలో కనుగొన్న నేపథ్యంలో మరింత లోతుగా దర్యాప్తు చేయడం అవసరమని పేర్కొంది. సీఐడీ ఏడీజీ సంజయ్ బుధవారం ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడారు. చిట్‌ఫండ్ పేరుతో జరిగిన అతిపెద్ద ఆర్థిక మోసాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అడ్డుకున్నట్లు వెల్లడించారు. చట్టవిరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించిన చరిత్ర కలిగిన మార్గదర్శి చిట్ గ్రూప్ 1982 చిట్ ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అమాయక చందారులను దోపిడీ చేస్తోందన్నారు. మార్గదర్శి ఉల్లంఘనలన్నీ కేంద్ర దర్యాప్తు సంస్థల పరిధిలో ఉన్నందున రెండు రోజుల పాటు ఢిల్లీలో ఆయా విచారణ సంస్థలను కలుసుకుని వివరాలు అందచేసినట్లు చెప్పారు. మోసపూరిత ఆర్థిక సంస్థలు చట్టాలను ఉల్లంఘిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ప్రేక్షకపాత్ర వహించరాదని సుప్రీంకోర్టు ఓ కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు.



'సుప్రీం' ఏం చెప్పిందంటే...

''చిట్ ఫండ్స్ చట్టాన్ని ప్రధానంగా చందాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు రూపొందించారు. కొన్ని మోసపూరిత ఆర్థిక సంస్థలు చందాదారులు/డిపాజిటర్లను మోసం చేయడమే కాకుండా నిధులను పక్కదారి పట్టించడం లేదా మళ్లించడం చేస్తున్నాయి. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు కఠినచర్యలు తీసుకోవడం రాష్ట్ర ప్రభుత్వాల విధి. ప్రజల సంక్షేమానికి సంరక్షకుడిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం దీనికి పరిష్కారాన్ని కనుగొనకుండా మౌన ప్రేక్షకుడిగా ఉండరాదు'' అని శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సంజయ్ తెలిపారు.

సత్యం, సహారా, శారదా తరహాలో..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఉల్లంఘనలు, మోసపూరిత పద్ధతులు సత్యం కంప్యూటర్స్, సహారా, శారదా చిట్స్ మోసాలకు చాలా దగ్గరగా ఉన్నట్లు సంజయ్ తెలిపారు. ఈ దోపిడీని అరికట్టేందుకు మార్గదర్శి ఖాతా పుస్తకాలపై లోతైన విచారణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ దిశలోనే తమ దర్యాప్తు కొనసాగుతోందని, తదుపరి వివరాలు తగిన సమయంలో వెల్లడిస్తామన్నారు.

రహస్యంగా నిధుల మళ్లింపు..


డిపాజిట్ల ద్వారా మార్గదర్శి సేకరించిన నిధులను అనుబంధ కంపెనీలు, షేర్ మార్కెట్లు, మ్యూచు వల్ ఫండ్స్ లాంటి ఇతర పెట్టుబడులకు రహస్యంగా మళ్లించడంతోపాటు అధిక మొత్తంలో సభ్యత్వాలు స్వీకరిస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడుతోందన్నారు. వడ్డీ, భద్రత అందించే పేరుతో చందాదారుల సొమ్మును మార్గదర్శి వద్దే ఉంచాలని బలవంతం చేయడం, 'చెక్స్ ఆన్‌హ్యాండ్, క్యాష్ ఆన్‌హ్యాండ్' పేరుతో నగదు నిల్వల్ని పెంచడం లాంటి మోసపూరిత అకౌంటింగ్ పద్ధతుల ద్వారా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈమేరకు ఎఫ్ఐఆర్‌లలో ఏ–1గా మార్గదర్శి చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ–2గా కంపెనీ ఎండీ శైలజా కిరణ్, ఏ–3గా బ్రాంచి మేనేజర్లు, ఏ–4గా కంపెనీ, ఏ–5గా ప్రిన్సిపల్ ఆడిటర్ కె.శ్రవణ్ పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. ఏ–1 నుంచి ఏ–5 వరకూ అందరినీ ఒక్కోసారి ప్రశ్నించినా తప్పించుకునే సమాధానాలు వచ్చాయని చెప్పారు. అవసరమైన సమాచారం, పత్రాలను చిట్ రిజిస్ట్రార్, సీఐడీకి మార్గదర్శి ఇవ్వడం లేదన్నారు.

సీఐడీ ప్రాథమిక విచారణలో ఏం తేలిందంటే...

- ▲ చిట్‌ఫండ్ చట్టంలోని పలు నిబంధనలను మార్గదర్శి గ్రూప్ ఉల్లంఘించింది.
- ▲ చందాదారుల సొమ్మును హెచ్‌యూఎఫ్ నియంత్రిత సంస్థలకు మళ్లించింది.
- ▲ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును ఎక్కువ రిస్క్ ఉన్న మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్‌కు మళ్లించారు.
- ▲ నాలుగు నుంచి ఐదు శాతం వార్షిక వడ్డీ రేటు అందిస్తూ భవిష్యత్తు సభ్యత్వాల రసీదు ముసుగులో అక్రమ డిపాజిట్లను బలవంతంగా తీసుకుంటోంది.
- ▲ చిట్‌ఫండ్ చట్టం 1982 ప్రకారం కంపెనీ బ్యాలెన్స్ షీట్, ఖాతాల వివరాలను అందించలేదు.
- ▲ ఖాతాలకు మసిపూసి మారేడు కాయ చేస్తూ అవసరమైన సమాచారాన్ని ఇవ్వడం లేదు.
- ▲ నిందితులు విచారణకు సహకరించకుండా వివిధ మార్గాల ద్వారా సీఐడీ పరువు తీయడం, నిందలు మోపేందుకు యత్నిస్తున్నారు.

పిటిషనే లేకుండా వాదనలా?

- మార్గదర్శి మౌఖిక ప్రస్తావనను తప్పుబట్టిన ధర్మాసనం
- తనిఖీలపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమన్న తెలంగాణ హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రత్యేకంగా పిటిషన్ దాఖలు చేయకుండా మౌఖికంగా రిలీఫ్ కోరడాన్ని తప్పుబట్టింది. అప్లికేషన్ (పిటిషన్) దాఖలు చేస్తేనే వాదనలు వింటామని తేల్చి చెప్పింది. మార్గదర్శి కేంద్ర కార్యాలయంలో కొనసాగుతున్న తనిఖీలను ఆపాలని, బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టును మార్గదర్శి ఆశ్రయించింది. బుధవారం ఉదయం జస్టిస్ బి.విజయ్ సేన్‌రెడ్డి ధర్మాసనం ఎదుట ఈ అంశాన్ని ప్రస్తావించగా.. రోజువారీ కేసుల విచారణకు ఇబ్బంది ఎదురవుతుందని, సాయంత్రం 4.30 గంటలకు దీన్ని మెన్షన్ చేయాలని ఆదేశించారు. సాయంత్రం విచారణ ప్రారంభం కాగానే మార్గదర్శి తీరును ఏపీ స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి తప్పుబట్టారు. 'ఉద్యోగుల నుంచి ఎలాంటి ప్రత్యేక అప్లికేషన్ లేకుండా రిలీఫ్ పొందాలని భావించడం సరికాదు. ఇది సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుంది. మౌఖికంగా ప్రస్తావించే వాటిని పరిగణనలోకి తీసుకుని ఆర్డర్ ఇవ్వకూడదని గతంలో ఇదే కోర్టు ద్విసభ్య ధర్మాసనం (యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ ఎస్ఎం హుస్సేన్ రషీద్ కేసు) తీర్పునిచ్చింది. అత్యవసర పరిస్థితి అంటే.. ఉరితీత, భవనాలను కూల్చడం లాంటివి మాత్రమే. చిన్న అంశాలను మౌఖికంగా మెన్షన్ చేయడం సమర్థనీయం కాదు. తనిఖీలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికే చాలా పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వానికి కౌంటర్ వేసే అవకాశం కూడా ఇవ్వకుండా ఆర్డర్ కోసం పట్టుబడుతున్నారు. చట్టపరంగా తనిఖీలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. తనిఖీలు కొనసాగుతున్నప్పుడు కోర్టు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు కూడా గతంలో ఆదేశించింది. తనిఖీలు పారదర్శకంగా సాగుతున్నాయి. ప్రజల నుంచి సేకరిస్తున్న నగదు నిర్వహణ నిబంధనల మేరకు జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదనే ఈ చర్యలు చేపడుతున్నాం. పిటిషనర్ చెబుతున్నట్లుగా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన ఎలాంటి డేటాను దర్యాప్తు అధికారులు సేకరించడం లేదు. కేసుకు సంబంధించి డేటా మాత్రమే తీసుకుంటున్నారు. గత నెల 21న కోర్టు ఆ పిటిషన్ వేసిన వారికి మాత్రమే రిలీఫ్ ఇచ్చింది. ఇది ఉద్యోగులందరికీ వర్తించదు' అని వాదనలు వినిపించారు. జీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఉద్యోగుల నుంచి ప్రత్యేక అప్లికేషన్‌తో రావాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ సమయంలో మార్గదర్శి తరపు న్యాయవాది జోక్యం చేసుకునే ప్రయత్నం చేయగా.. 'ఇప్పటికే పలు పిటిషన్లలో అరెస్టు సహా బలవంతపు చర్యల నుంచి ఉపశమనం పొందారు. ఈ మౌఖిక ప్రస్తావనలో ఎలాంటి ఉపశమనం ఇవ్వలేం. పిటిషన్ దాఖలు చేస్తేనే వాదనలు వింటాం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది.

బావాజీ హుండీ లెక్కింపు.. రూ.18.91 లక్షల ఆదాయం



హుండీ లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గురులోకామాసంద్ ప్రభు(బావాజీ) ఆలయ హుండీ లెక్కింపును అధికారులు బుధవారం ఆలయ ఆవరణలో చేపట్టారు. గురులోకామాసంద్ ప్రభు వద్ద ఉన్న హుండీలో రూ.18,91,608, అంజనేయస్వామి వద్ద ఉన్న హుండీ నుంచి నుంచి రూ.1,57,595 వచ్చినట్లు ఆలయ ఈఓ కొమ్మాల్ తెలిపారు. కాళికాదేవి వద్ద ఉన్న హుండీని గురువారం లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. లెక్కింపులో మద్దూరు ఎస్‌బీఐ సిబ్బంది, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

పడిపోయిన ఉల్లి ధర



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి కుప్పలు



ఉల్లిని బస్తాలుగా తూకం వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్న హమాలీలు

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డుకు బుధవారం ఉల్లి పోటెత్తింది. మార్కెట్ ఆవరణ అంతా ఉల్లి కుప్పలతో నిండింది. యాసంగి సీజన్ వరి ధాన్యం పోయడానికి చోటు లేని పరిస్థితి ఉండగా, మార్కెట్ షెడ్లలో, గోదాముల పక్కన కుప్పలుగా పోశారు. దాదాపు 5వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. ఉదయం 10 గంటల నుంచి వేలం ప్రారంభమై మధ్యాహ్నం వరకు కొనసాగింది. అయితే ఉల్లి ధర రూ.వెయ్యి దాటని పరిస్థితి కనిపించింది. చాలా మంది వేలం లేకుండానే ఉల్లిని నేరుగా అమ్ముకున్నారు. వేలంలో ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.950, కనిష్టంగా రూ. 610 పలికాయి.

జోరందుకున్న వ్యాపారం

ధరలు తగ్గడంతో చాలా మంది వినియోగదారులు బస్తాలుగా ఉల్లిని కొనుగోలు చేశారు. ప్రస్తుతం వేసవిలో వచ్చిన ఉల్లి కావడంతో నాణ్యంగా ఉండడంతో పాటు బాగా ఆరినది కావడంతో ఏడాది పాటు నిల్వ చేసుకోవచ్చని చాలా మంది వినియోగదారులు ఉల్లి కొనుగోలు చేయడంతో మార్కెట్ అంతా సందడిగా కనిపించింది. ఇతర ప్రాంతాల వ్యాపారులు కూడా కొనుగోలు చేసిన ఉల్లిని వాహనాలలో తరలించారు. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.500 నుంచి రూ.450, కనిష్టంగా రూ.400 నుంచి రూ.300 వరకు విక్రయించారు.

మార్కెట్ బయటే విక్రయాలు..

చాలా మంది రైతులు మార్కెట్‌లో విక్రయించకుండా నేరుగా బయటే విక్రయాలు సాగించారు. ఉదయం 8 గంటల నుంచే రైతులు ట్రాక్టర్లలో బస్తాలుగా తెచ్చి అమ్మారు. మార్కెట్‌లో వేలం వేసి తూకాలు వేసే వరకు సాయంత్రం కావడంతో పాటు ధరలు కూడా తక్కువగా వస్తుండడంతో రైతులు నేరుగా మార్కెట్ బయట రోడ్డుపై పెట్టుకుని ఉల్లిని విక్రయించారు. బస్తా ధర రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయించారు.

దివ్యాంగుల వాటా 12.2 శాతానికి పెంచాలి

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



మాట్లాడుతున్న అడివయ్య

మహబూబ్‌నగర్ రూరల్: దివ్యాంగుల జనాభాకు అనుగుణంగా సంక్షేమ పథకాల్లో వాటాను 12.2 శాతానికి పెంచాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టి.మధుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్ పెంపు, ఉచిత విద్యుత్, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. అంతేగాక నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రత్యేక చట్టం తీసుకరావాలని కోరారు. తెలంగాణలో దివ్యాంగుల జనాభా లెక్కలు సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 10.48 లక్షలు, 7 రకాల వైకల్యాలు ఉన్నట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించిందని.. ప్రస్తుతం 2016 ఆర్‌పీడీ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలు ఉన్నాయని తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా హక్కులు, సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలుకు పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని.. ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభుస్వామి, శ్యాంసుందర్ రెడ్డి, మొగులయ్య, మంగమ్మ, చిట్టి పాల్గొన్నారు.

వైభవంగా దిగంబరస్వామి రథోత్సవం



బల్గెరలో రథం లాగుతున్న భక్తులు

గట్టు: మండలంలోని బల్గెరలో వెలసిన దిగంబర స్వామి రథోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా బల్గెర, మాచర్ల గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామి రథాన్ని అందంగా ముస్తాబు చేశారు. స్వామి వారి ఉత్సవ మూర్తి విగ్రహాన్ని రథంపై ఏర్పాటు చేసిన అనంతరం భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్‌చైర్మన్ గట్టు తిమ్మప్ప, భువనేశ్వరి, సర్పంచ్ హనుమంతు నాయుడు, జెడ్పీటీసీ బాసు శ్యామల, నారాయణరెడ్డి, ఎంపీటీసీ రూపవతి, మాచర్ల సర్పంచు సిద్దిరామప్ప, భక్తులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలు

- మే 1 నుంచి ప్రారంభం
- నెలరోజుల పాటు కొనసాగింపు
- శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా యువజన, క్రీడాశాఖ



మహబూబ్‌నగర్ స్టేడియంలో వేసవి వాలీబాల్ శిబిరంలో క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేసవి సెలవుల్లో చిన్నారులు, యువత కోసం ప్రత్యేక వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు కొనసాగుతాయి. నెలరోజుల పాటు కొనసాగే శిబిరాల్లో వేలాది మంది ఔత్సాహిక క్రీడాకారులు శిక్షణ తీసుకుంటారు. ఆయా క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతారు. ఔత్సాహిక క్రీడాకారులకు ఈ శిబిరాలు వేదికగా నిలుస్తాయి.

జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో..

ఈ ఏడాది జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలు నిర్వహించనున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఆదేశాల మేరకు ప్రతి ఏటా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 10 వరకు శిబిరాలు నిర్వహిస్తారు. అయితే పట్టణప్రాంత ఔత్సాహిక క్రీడాకారుల కోసం అర్బన్ కింద మరో 5 నుంచి 6 శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

ఈ ఏడాది జిల్లాలో శిబిరాల నిర్వహణపై జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రధాన క్రీడలకు సంబంధించి మే 1వ తేదీ 30 వరకు శిక్షణ ఇస్తారు. వేసవి శిబిరాల నిర్వహణకుగాను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ బుధవారం దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేశారు. జాతీయస్థాయి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ, పీఈటీ), సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్రీడల్లో తాము సాధించిన ధ్రువపత్రాలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 20 వరకు జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలోని ఉన్న యువజన, క్రీడల కార్యాలయంలో వ్యక్తిగతంగా కాని, పోస్ట్ ద్వారా పంపాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకుగాను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) నుంచి ఉత్తర్వులు వచ్చాయి. శిబిరాల నిర్వహణకుగాను సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను 8 నుంచి 16 ఏళ్లలోపు బాల బాలికలు సద్వినియోగం చేసుకొని జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు



మక్తల్‌లో క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

మక్తల్: అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలో మక్తల్ క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారని రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. మక్తల్ పట్టణంలో సత్యసాయి మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడి చేతులమీదుగా క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్య అంజనేయులు, తాన్‌సింగ్, భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, అంబ్రేస్, రమణమ్మ, దామోదర్, శ్రీలత, సునీత, స్వప్న, సిద్ధమ్మ, 50మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

సిర్సనగండ్ల ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 29 నుంచి ఈనెల 4 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీలను ఆలయ చైర్మన్ రామశర్మ, ఎండోమెంట్ అధికారి వీణాధరి, ఈఓ రఘు, అధికారుల సమక్షంలో లెక్కించారు. సాయంత్రం వరకు లెక్కింపు కొనసాగింది. మొత్తం రూ.12,46,259 వచ్చినట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. గతేడాది కంటే రూ.2.2లక్షలు ఎక్కువగా వచ్చినట్లు పేర్కొన్నారు.